# నీ కళ్లను నమ్మకు

‘‘యెన్నాళ్లైంది నిన్ను చూసి చిత్రా? మనం బోజమ్ ఫ్రెండ్స్ కాకపోయినా చిత్రా! మరపురాని దానివే నువ్వు. యెక్కడన్నా కలుసుకుంటామేమోనని అనుకుంటూనే వుంటా. స్టేట్స్‌కి వెళ్లగలిగానని గర్వపడ్డాగానీ చిత్రా! తీరా వెళ్లి జాబ్‌లో చేరాక మనదేశమే బాగున్నదనిపించింది. లే ఆఫ్ లతో ప్రాణం చాలుకొస్తుంది. పర్మనెంట్ వుద్యోగమనేది యివ్వరు. కాంట్రాక్టులే. స్టేట్సేమో అడ్వాన్స్‌డ్ భాగ్యవంతులేగానీ చిత్రా, అన్నీ గమనిస్తారు, రెస్ట్రిక్షన్సూ వుంటాయి. పైన పటారం లోపల లొటారం. అసలు జగమే మాయ’’ అలా వాగుతూ అన్ని వేపులా చూసింది బిందు. గోడకి వేలాడుతూ పోర్ట్రెయిట్ కంటబడింది. మనిషి చూపుల్ని కట్టేసేట్టున్నది ఫొటో.

‘‘ ఇదెవరి ముఖచిత్రం? చిత్రా! ఎక్సెలెంట్. పెళ్లాడావా? మనం వున్నత పాఠశాలలో చదువు వెలిగిస్తున్నప్పుడు, అది ఆడపిల్లలబడే, హాస్టల్లో వున్నాం. ‘‘పెళ్లాడను’’ అనేదానివి. నాగరత్నం సహాధ్యాయి నవ్వి’’ అలా బీరాలు పల్కేవాళ్లు త్వరగా కానిస్తారాపని’’ అనేది.

చిత్రాంగద రిఫ్రెష్‌మెంట్సున్న ట్రే బిందుకెదురుగా బల్లమీదుంచింది. ‘‘పోనీ అలానే అనుకో. యెలా అనుకున్నా ప్రమాదం లేదు. జగమే మాయా అని నువే అన్నావు’’ అని తాను యెదురుగా కుర్చీలో కూచున్నది.

బిందు యెంతో యిష్టతతో తింటూ, బాదంగీర్ సిప్ చేస్తూ మూతి రుమాలాతో అద్దుకుంటూ అన్నది. ‘‘ ఆడ లేదా యేం? ఆ ఫొటోలో వున్న ఆఫీసర్ మొహంలో దర్పం, ఠీవీ, మూతి బిగింపులో పట్టుదల వెల్లడౌతున్నాయి. గెజిటెడ్ ఆఫీసరేనా? సివిల్? ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్? యేది?’’ అని వాగుతూ కుకీస్, బాదం పూర్తి చేస్తున్నది.

‘‘నీ కళ్లను నీవు నమ్మకు బిందూ. అవి బాగా మోసగిస్తాయి. నీరు పల్లమెరుగు నిజముదేముడెరుగు’’.

''నేను నీ వన్నదానితో యేకీభవిస్తాను. స్టేట్స్ మెరమెరలు నన్నలాగే మోసగించాయి. స్పార్క్లింగ్ డైమండ్స్‌లాగా కనిపించి, చివరికవి ప్లాస్టిక్‌పూసలూ స్టడ్సూ అని తేలింది. ప్లాస్టిక్‌పూసలు గుచ్చుకుంటాయి కూడానూ. యెందుకలా అంటున్నానంటే చిత్రా! నమ్మవేమో! స్టాప్ అండ్ షాప్‌లో కౌంటర్ దగ్గరున్నా. డిష్‌వాషర్‌గా రెస్టారెంటులో పనిచేశా. బ్యూటీపార్లర్‌లో అసిస్టెంట్‌గా, కొద్దిరోజులు అకౌంటెంట్‌గా పచారీషాపులో, చివరికి చాకిరేవులో చాకలిలాగా గూడా పనిచేశా'' అని హాయిగా నవ్వింది బిందు. ''చాకిరేవంటే డ్రైక్లీనింగ్, వాషింగ్ మెషీన్, యిస్త్రీ చేసి సర్ది యివ్వటం పెద్ద షాప్. అన్నీ మెషీన్లే. యెన్ని మెషీన్లున్నా మనిషి కావాలి. అన్ని జీవులలో దేవుడున్నట్లు'' అని మళ్లా నవ్వింది. గుర్తు తెలియకుండా ప్లాస్టిక్ కవర్ ధరించి వెళ్లచ్చు పన్లోకి. అప్లై చేస్తూనే వుండాలి. మంచిపే నచ్చిన జాబ్ అందగానే అందులో దూరేదాన్ని''.

కాలింగ్‌బెల్ వినపడగానే చిత్రా వెళ్లి గొలుసు తీసి తలుపు తీసింది. బహుశా ఆఫీసర్ వచ్చి వుండాలి అనుకున్నది బిందు. చిత్రా వచ్చి పక్కగా నిలబడింది.

ఆరుగురు ఆఫీసర్లు లోపలికొచ్చారు. నవ్వు మొహాలు. వారిలో హబ్బీ ఆఫీసర్ని గుర్తించాలని కొద్దిగా కళ్లెత్తి చూసింది బిందు. ఫుల్‌డ్రెస్. అందంగా ఆరోగ్యంగా వుండటమేగాక ఒకే యెత్తు. మంచిరంగు. ఒకడు పక్కనే తలుపులు తీసివున్న బెడ్‌రూమ్‌లో కెళ్తుంటే వాడి నిద్దరనుసరించారు. అందమైన కర్టెన్ రెపరెపలాడింది.

మిగిలిన ముగ్గురు సంశయంలేక కుషన్ కుర్చీల్లో ఆసీనులైనారు. సీలింగ్ ఫాన్స్ తిరుగుతున్నాయి. అది డ్రాయింగ్ రూమ్. అద్దాల బీరువాలో పుస్తకాలు. పైనబొమ్మ.

చిత్రా ఫార్మల్‌గా ఇంట్రడ్యూస్ చేసింది.

'' ఈమె బిందు మాధవి. నా బాల్య సహాధ్యాయి. స్టేట్స్‌లో జాబ్. శలవుమీద వచ్చింది. చిన్ననాటి సహాధ్యాయులను చూడటం యిష్టం. మరొక

సహోధ్యాయి వల్ల తెలుసుకుని నన్ను చూడవచ్చిందప్పుడే'' అని బిందువంక చూసి అక్కడున్నవారిని పరిచయం చేయబోతుండగా బెడ్‌రూమ్‌నించి తక్కిన ముగ్గురూ వచ్చి ఆసీనులైనారు.

ఆఫీసర్ ఆకు పచ్చనేత లుంగీ, రుద్రాక్ష అంచులున్నది కట్టి ముందు బొజ్జమీదికి ముడికనపడేలా వేశాడు. దాని మీద బెల్టూ. చొక్కా లేదు. పసిమి మనిషి, నునుపైన మొహం బుగ్గలూ చెంపలూ, గడ్డం కోలగా వుంటుంది. మెళ్లో గొలుసన్నా లేదు. ఛెస్ట్ ఆకర్షిస్తున్నది. చిరుబొజ్జా. నవ్వుతూ, కళ్లు తిప్పుతూ, తల కదిలిస్తూ అన్నాడు.

''పరిచయాలు నే చేస్తాలే చిత్రా. లోపలికెళ్లి మింగుడూ తాగుడూ, బండిమీదమర్చి నెట్టుకురాపో. యేం లేకపోతే గబగబా యేదైనే చేసి తీసుకురా. అన్నీ ఇన్‌స్టెంట్ పొట్లాలేగా'' అని చేయి ఆడించాడు.

చిత్రా వెళ్లింది. బిందు ''వాడే హబ్బీ ఆఫీసర్'' అనుకున్నది.

''చిత్రా మాటలు మాకు వినబడినై మేడమ్. వీడు లక్ష్మీకాంతం. జనరల్ సర్జరీ. యెమ్మెస్. ప్రొఫెసర్'' అని తన పక్కనున్న మనిషిని చూసి '' ఈమె అక్వేరా అంటే మత్స్యగంధి. నర్స్ ట్రైనింగ్ యిన్‌స్టిట్యూట్ డైరెక్టర్. గోవన్''. మళ్లా మరొకరి వంక చూస్తూ, '' ఈ ప్రొఫెసర్ సీతాపతి. సీతా అని పిలుస్తాము. పలుకుతాడు. పతి అనేది తీసేసినా నొచ్చుకోడు. యమ్‌డి. ఛెస్ట్ డిసీజెస్ స్పెషలైజ్ చేశాడు. ''మళ్లా రెండో పక్కనున్న ఆఫీసర్ వంక నవ్వుతూ చూసి ఈమె యన్సీసీ కప్తాను. మారీడ్. భర్త ఆ విభాగంలో డాక్టరు. నాలుగో నెల కారీ చేస్తున్నది. యూనిఫామ్ మానేసి చీరా రవికా కట్టు. శలవుపెట్టు. యెటుపోయి యెటొస్తుందో అంటే వినదు'' అని నవ్వుతూ ''నలభైనాల్గు. కంటి అద్దాలూ వాడదు'' అంటుంటే గర్భిణీ ఆఫీసరు నొచ్చుకోక ''చింతామణిది వల్గర్ హ్యూమర్. ముసలి కాన్పు అని చెప్తున్నాడు. వాళ్ల యిలవేల్పు పేరుపెట్టారు అమ్మా నాన్నా'' అని తానూ హాస్యమాడింది.

''ఈయన హసన్. హెచ్ ఆర్ డి అంటే సారమున్న ధరఖాస్తుదారుని కనిబెట్టి జాబ్‌లో మణిని బంగారంలో బిగించినట్టు పొదిగే డైరెక్టరు. మరో విధంగా చెప్పాలంటే పేరయ్య. పెళ్లిళ్ల వివరాలు పేపర్లో పెళ్లిపందిరిలాగా వేయిస్తాడు డైరెక్టరు. పెళ్లికూతురు జాబు అయితే పెళ్లికొడుకు ధరఖాస్తుదారు. ఇవ్వాల్సిన కట్నం, లాంఛనాలు, ఆనవాయితీలు, మర్యాదలూ అన్నీ వివరించి అంగీకారమైతే లగ్గం పెట్టేస్తాడు''.

''నీ స్టైల్లో నువ్వూ చేస్తావులే చేసే జాబు చింతామణీ పేరుకు తగ్గట్టు, తళుకు బెళుకులూ, సరసాలూ, ఆకర్షిస్తావు. రెండు పూట్లా షేవ్ చేసుకుంటావేమో. యెముకలు కనపడని శరీరం. నునుపైన చెంపలూ'' డైరెక్టరన్నాడు.

''పొద్దున టైమ్ చాలదు. టైమ్‌కి ఆఫీసులో వుండాలి. ఇంట్లో పనిచెప్తానే వుంటారు వెళ్లేదాకా. అందుకని రాత్రి షేవ్ పూర్తి చేస్తా. నీ వల్లే పేడిమూతీ రిబుల్ వుండాలా?'' అన్నాడు రోషపడిన ఆఫీసర్.

''అందరికీ నా చెంపలూ బుగ్గలంత నునుపైనవి వుండవు. నాకు సహజంగానే నునుపు మెత్తదనం ఉన్నాయి''. గర్వంగా మొహం ఒళ్లూ రాచుకుంటూ అన్నాడు ఆఫీసర్ చింతామణి.

''గడచిన కాలంలో తెల్లపాలకులున్నప్పుడు, కొత్త వైస్రాయి యెలావుంటాడోనని చూడవచ్చేవారుట. ఒక వైస్రాయి పేరు గుర్తులేదు. శాన్నాళ్లైపాయె, మొహం నున్నగా చేసుకుని దర్శనమిచ్చాడుట. అదేం సొగసూ, ఆడదాని సొగసు! మీసమేదీ? గడ్డమేదీ? అని ముక్కుమీద వేలువేసుకున్నారట కలర్డ్‌రేస్'' అని నవ్వుతూ చూచాడు డైరెక్టర్ ఆఫీసర్.

బండినెట్టుకుంటూ వచ్చేసింది చిత్రా. అందరికీ ప్లేట్లు అందించి పక్కనున్న చిన్న బల్లల మీద డ్రింకులుంచింది. యెదురుగా బల్లమీద వేడి కాఫీ నురగలు కక్కుతున్నది.

''అపుడే చేశారా యివన్నీ? మంత్రాలొచ్చా'' హెచ్ ఆర్ డి ఆఫీసర్ కళ్లు పెద్దవి చేసి చూశాడు చిత్రాని.

''అవసరమేది ఆఫీసర్? మోడరన్ లైఫ్ లీడ్ చేయాలనీ, ఫాస్ట్ ఫుడ్ రెస్టారెంట్ లాగా వుండాలనీ మీ ఫ్రెండ్ ఆఫీసర్ ఆశయం. మైక్రోవేవ్ ఓవెన్, ఎలక్ట్రికల్ కుకర్, పాల కుకర్, కూరకుకర్, వేపడం మెషీన్ కొన్నారు. వాడటం నేర్పారు. బ్రెడ్ రోల్స్ సమోసాలు మెషీన్‌లో వుంచుతా. కాఫీ మెషీన్''.

సుశీల్‌శర్మ దుమారంలాగా వచ్చింది డ్రాయింగ్‌రూమ్‌లోకి అందర్నీ సింహావలోకనం చేసింది. ఆమెకేర్ హోమ్ డైరెక్టరు. రిహాబిలిటేషన్ చూస్తుంది. సోషలైట్. అందర్ని పలకరించి ఫార్మాలిటీస్ చెల్లించింది. హౌ డుయుడు, హౌయీజ్ ది ఓల్డ్ కంప్లెయింట్ అలా అవసరం లేకపోయినా చెల్లిస్తుంది. చనవుగా వచ్చి చింతామణి పక్కన సోఫాలో కుదిరికగా కూచున్నది.

''మణీ! గెస్ట్సుకి డామ్ చూపిద్దామని ప్రోగ్రామ్ వేశాము. ఆరింటికల్లా కార్లలో వుండాలి. యెసి అరేంజ్‌మెంట్సున్నాయి కార్లకు. నాలుగున్నరయిందే. డ్రెస్ చేసుకోవాలి నువ్వు. అందరూ టిప్‌టాప్‌గా వున్నారు. కమాన్. నేను డ్రెస్ చేసేదా?'' అని మోచేత్తో నెట్టింది శర్మ.

''బాత్ తీసుకోవాలి'' అన్నాడాఫీసర్. తింటూ తాగుతూ కదుల్తూ నవ్వుతూనే వున్నాడు.

బిందు చిత్ర వంక చూసింది. చిత్ర అభినయించింది.

రెండు బెడ్రూముల మధ్య బాత్ వున్నది. ఆ రూమ్‌లోకి నెడుతుంది ఆఫీసర్ని. తాను గూడా వెళ్లదూ? తొట్టియా? షవరా? రెండూనూ. యేది కావాలంటే అదీ. సబ్బూ టవల్.

తింటూ తాగుతున్నవారు వీరిని గమనించలేదు. అన్నీ బండిలో సర్ది చిత్రా నెట్టుకెళ్లింది. బిందు మాసపత్రిక అందుకుని తిరగేయసాగింది.

ఆఫీసర్, సుశీల్ వచ్చి కూచున్నారు. ఆఫీసర్ మంచి దుస్తులేసుకుని తల

దువ్వుకుని వున్నాడు.

''మెయిడ్ రాలేదూ?'' సుశీల్ ప్రశ్న. ''నాకు ఫోన్ చేసి వుంటే నా మెయిడ్‌ని తోలేదాన్నే'' అన్నది.

వచ్చిన చిత్ర అన్నది. ''అది మెడిల్‌సం. అంతేగాక, ఆఫీసరుగారి నీస్‌కి లేబర్ మొదలైందిట. తల్లి ఒక్కతే చేయలేదని ఆపీసరుగారు ఆషా మెయిడ్‌ని కార్లో పంపారు ఫోన్ రాగానే. నాకు స్వయంగా సర్వ్ చేయటం సంతోషం. నిలబడి చూడాలంతే వర్క్ యీజ్ గాడ్'' అని నవ్వింది చిత్ర.

''చిత్రానే వెళ్లమన్నా మేడమ్. నా నీస్‌కి నిండా యిరవై ఆరేళ్లు లేవు. అప్పుడే ఆరో కాన్పు. పురుడ్రాకపోతే ఆయుధం వాడాలో, సీజేరియన్‌ని తయారు చేయాలో చెప్పగలదు చిత్ర. కొన్నాళ్లు ఆగ్జిలరీ నర్స్‌గా జాబ్‌చేసింది గదూ. వెళ్లనని మోడు వేసింది. అయ్యో రాత. గౌరత పోతుందా? అసలూ నా నీస్‌కి పెళ్లి ఆపాలనే'' అపుడే యేం పెళ్లి? అంటే నన్నో అడివిమనిషిని చూసినట్లు చూసి, అడివి ఆఫీసర్'' అన్నారు. అంటే ఫారెస్టాఫీసరన్నమాట. టెన్త్ పాసైందంతే. చిన్నపిల్ల కనలేదేమో అనన్నా చూడకుండా ఆ మగడు కాన్పుకి తెచ్చేశాడు దాన్ని'' అని నోటి మీద చేయి వేసుకుని ''హవ్వ'' అన్నాడాఫీసరు. '' ఇది కాదు పని అని బర్త్ కంట్రోల్ పాటించటం లేదని కంప్లెయింట్ చేశా. వాళ్లు సర్జన్స్ నవ్వి వాడిని పట్టుకుపోయినారు. ఇంక ష్యూర్‌గా ఆగిపోతాయి కాన్పులు''.

''వాళ్లు వచ్చేస్తే శ్రమ తగ్గుతుంది గదా చింతామణీ గౌరవహానియా యేం'' సోషలైట్ సుశీల్ అడిగింది.

''వచ్చేదే. నీస్ అత్తగారు వచ్చి నీస్‌ని దుయ్యపట్టిందిట. సిగ్గుబడి అంతగా రావటం ఆపింది నీస్''.

''యెలా దుయ్యబట్టిందీ అత్తా?'' సుశీ అడిగింది.

''అయినదానికీ కానిదానికీ, చీటికీ మాటికీ యెగురుతూ బాబాయి యింటికి పరుగెత్తటమేమిటి? చిన్నపిల్లవా? చితక పిల్లవా?వాళ్ల చేతిది

వదిలించటమేమిటి? ఇటు చెంబటు పెట్టవు. దారువులాగా ఆ పడుకోటమేమిటి? సిగ్గేయదూ? ఆడజన్మ యెత్తలేదూ? అదేమంటే యెనీమియా అనో యెపిలెప్సీ అనో అని జవాబు'' అని దులిపిందట అత్త.

ఆఫీసర్ అభినయం వాచికం చూసి అంతా నవ్వారు. మెచ్చినవ్వుతున్నారని ప్రోత్సాహమివ్వగా ''నా బ్రదర్ గాస్‌లైట్‌ని వరించి సివిల్ మారేజ్ చేసుకునింటికి తెచ్చి అమ్మ యెదుటనించో బెట్టాడు'' అంటున్నాడు.

''గాస్‌లైట్ అంటే'' అనడిగింది బిందు.

''కాటుక పిట్టలాగా వున్న బ్రైడుని అలా హాస్యానికంటారు. మా అమ్మ '' ఆ తెచ్చుకోటం కాస్త తెల్లదాన్నే తెచ్చుకోకపోయావూ?'' అన్నది.

సోషలైట్ మేడమ్ నవ్వి, ''పేరుబడిన యాక్టర్ అతి సహజంగా స్త్రీలాగా నటిస్తే, అంతబాగా యెలా చేశారు అనడిగితే, ''చిన్నప్పుడంతా మా అమ్మను పరిశీలించి ఆమె హావభావాలు అలవడినై'' అన్నాడట. నా ఫ్రెండ్ టీనేజరప్పుడు, స్కూల్ అనివర్శిరీకి సక్కుబాయి నాటకంలో సక్కుబాయి అత్తగారు వేసి అతి సహజంగా నటించి గోల్డ్‌మెడల్ కొట్టాడు. తరవాత స్టేట్ యాక్టరై పేరు తెచ్చుకున్నాడు. చిన్నతనంలో అత్తగార్లను స్టడీ చేశాడాఫీసర్. ''చిత్రా యింకా టైమున్నది. వీళ్లకి కొంచెం కుయ్‌కుయ్‌మని వినిపించు. తరవాత కొంచెం పిల్లడా లోకాలు పాడి వినిపించు సంతోషిస్తారు?'' అన్నాడు.

''అంటే?'' అని చిత్రాని చూసింది బిందు.

''వైలిన్ వాయించి వినిపించు అంటున్నారు. రాధావిలాపం అనే గేయాలు లలిత సంగీతం పాడి వినిపించమంటున్నారు'' అని వెళ్లి వైలిన్ తెచ్చి నిలబడి స్ప తి చూస్తున్నది చిత్ర. అందరూ చూస్తున్నారు నిలబడే ఎలా వాయిస్తుందని. ''నళినాక్షీ నిన్నెంతో'' వాయించు అన్నాడాఫీసర్. మళ్లా చిత్ర వంక చూసింది బిందు.

'' ఆరభి వర్ణం వాయించమంటున్నారు'' అని వాయించింది చిత్ర. ఛిన్

రెస్టు మీద తల ఆనించి అలాగ్గా వాయించి అవతలుంచింది. వేదాల వీధిలో విహరింపబోయెనో, వాదాల యెండలో వడగొట్టి పండెనో, చూడనైనా చూడవే కోకిలా జాడలైనా గాంచవే అని రెండు గేయాలు పాడి ఆపేసింది.

''వండర్‌ఫుల్'' అని చప్పట్లు కొట్టారు.

ఆఫీసర్, '' నా ఓల్డర్ బ్రదర్‌కి అవంటే యిష్టం. సిస్టరిన్లా ఆర్డోడాక్సు. యెంతచెట్టుకంతగాలి అని వచ్చింది వచ్చినట్టు ఖర్చయిపోతుంది. ముద్దు ముచ్చటలూ లేవు వాడికి, వాడి ఆనందకోసం తాపత్రయ పడేవారే లేరు. సంపాయించి పొయ్యటమే వాడి డ్యూటీ. అందుకని రాగానే చిత్రాని అడుగుతాడు యేమేమి కావాలో. మా అన్న చిత్రాకి అనుకూలవతి అని కితాబు యిచ్చాడు.

సుశీల్ నవ్వుతూ లేచింది. ఆఫీసర్ని లేవదీయాలని చూస్తూ, ''టైమైంది. పోదాం ఆఫీసర్. సిల్క్ లాల్చీ పైజమా, వల్లెవాటులాగా వేసుకున్న షేర్వాణీతో అచ్చ స్త్రీలాగానే వున్నారు. కదలికలూ, నవ్వే మూతీ గూడా అంతే'' అని చేయి పట్టుకులాగుతున్నది.

కాని లేచిన ఆఫీసర్అభినయమూ ఆపలేదు. చెప్పటమూ ఆపలేదు. ''మీ అమ్మ చేయలేక పోతున్నారని యిరుగమ్మ పొరుగమ్మా అంటే, కుక్‌ని పెడ్తానంటే మా అమ్మ, ''చడేలే సౌడభ్యం, నేను వంటచేస్తూ మానేజ్ చేస్తుంటేనే, నా పెద్దబిడ్డ సంపాదన చాలటం లేదు. వంటమనిషి దోచటానికే కుదుర్తుంది'' అని వీటో అధికారం వెల్లడించింది మా అమ్మ. మా అన్నతో బాంధవ్యమే గొప్ప అని పిల్లనిచ్చారు. కోడలు అప్పచెల్లెళ్లు కోడల్ని చూసి అసూయపడ్తూ, ''దీనికెంత దివ్యమైన సంబంధమొచ్చిందే! ఇప్పటినించే దీన్ని ముద్దు చేస్తున్నారు. వంటావార్పూ పీడలేదు దానికి'' అన్నారు.

కోడలు నీళ్లోసుకున్నదని నా చెల్లి నాకు చెప్పేదాకా తెలియనే తెలియదు'' అన్నాయి కోడలుకి అయిదో నెల. చూసిరా. యేదైనా బహుమానమివ్వాలి'' అన్నది. కోడలు తండ్రి పచ్చగా దబ్బపండురంగు. ఒకస్టార్ ఆయన్ని వలచి

వచ్చింది. వయసు మళ్ళినామే. ఆమెను మా కోడలు అమ్మా అని పిలుస్తూ కొంగు పట్టుకు తిరుగుతుంది. కోడలుకన్నీ ఆ తారే కొనిపెడ్తుంది ముద్దుగా.

సుశీల్ నవ్వుతూ లాక్కెళ్తూనే వున్నది అయినా సరే వెనక్కి చూస్తూ చెప్తూనే వున్నాడాఫీసర్. మా అమ్మ పెద మేనమామ ఒక్కగానొక్క కూతుర్నీ గారంగా పెరిగినదాన్ని చెన్నై సంబంధం కుదిరిందని చంకలు కొట్టుకుంటూ వైభవంగా పెళ్లి చేసి చెన్నై తోలారు. తండ్రి రఘురామయ్య లాయరు, వియ్యంకుడు ప్రాసిక్యూటర్. దీటుకు దీటు అని మురిసిపోయాడు లాయరు. హవ్వ! ధాత వరలక్ష్మి టెన్త్ పరీక్ష అయిందనిపించిందంతే. తల్లేమో లేచిపోకముందు మూడుముళ్లూ వేయించండీ. మగపిల్లల బడి అయిపాయె'' అని జోరీగలాగా చెవిలో రొద. వరలక్ష్మికి యెనిమిదేళ్ల కాపరం వెలిగించినా కడుపు పండలేదు. నేను అఫీషల్ పనిమీద చూడబోతే అమ్మలక్కలు ''వరలక్ష్మమ్మ గొంతు కోశారు సామీ'' అంటే అర్థంగాలేదు. విచారిస్తే పెళ్లికొడుక్కి పెళ్లినాటికే కళ్లజబ్బున్నది సరిగా చూపానదు. మమ్స్ వచ్చి నయమైంది. ఆ రెండు వ్యాధులూ సంతానం కలిగే జీవకణాల్ని తుడిచేస్తాయి. వరలక్ష్మిని చూచిపోదామని వచ్చానంటే, దాన్ని వంటింట్లో పనిలో పెట్టి, అబ్బాయిని కుర్చీలో కూచోబెట్టి, అప్పచెల్లెళ్లూ తల్లీ వాడి చుట్టూ తిరగసాగారు. కూపీ లాగితే నిజం తెలిసింది. వీళ్ల రోగం కుదిర్చే దిట్టా గాదని వరలక్ష్మి చేత ప్రైవేట్‌గా పరీక్షలు వ్రాయించా. భీమా కంపెనీలో జాబ్ యిప్పించా దానికి''.

వీధిలోకి లాక్కెళ్లినా కారు తలుపు తీసిపట్టుకున్నా చెప్తూనే వున్నాడాఫీసర్. ''మా అమ్మ రెండో మేనమామ కూతురు హిడింబిలాగా యెదిగింది. దానికి చదువూ సంగీతం అబ్బినై. పెళ్లికెదిగింది. పిల్లను చూచి ధడుచుకుని పెళ్లిచూపులకొచ్చిన పెళ్లివారు నచ్చలేదన్నట్టు డొంక తిరుగుడుగా చెప్పారు. కాని జర్నలిస్టు పెళ్లికొడుకు ''చేసుకుంటే నేను రత్నావళినే చేసుకుంటా. లేకపోతే సన్యసిస్తా. కట్నం లాంఛనాలూ ముఖ్యం కాదు'' అని లేచాడు.

వాళ్లవాళ్లు ధడుచుకుని ''అన్నంత పనీ చేస్తాడేమోనని తాంబూలాలు

పుచ్చుకుని లగ్గం పెట్టించారు''.

కారులోకి నెట్టి నవ్వుతూ తలుపు మూసింది సుశీల్.

కార్లు కదిలేదాకా చిత్రకి ఆర్డరిస్తూనే వున్నాడాఫీసర్. లైట్లు వెలిగినై. ఇద్దరూ లోపలికొచ్చారు. పిల్లలు డైనింగ్ టేబిల్ ముందున్నారు. సర్వ్ చేశారిద్దరూ. గబగబా తిని మేడమీదకెళ్లారు పిల్లలు. డాన్స్ బేబీ డాన్స్ అనే ప్రోగ్రామ్ చూడాలిట.

బల్ల క్లీన్ చేసి తమ యిద్దరికీ సర్వ్ చేసింది చిత్ర. టైమ్ చూస్తే యెనిమిది కావస్తున్నది.

బిందు భోజనం కానిస్తూ అన్నది. ''నీ వన్నది నిజం చిత్రా! వింటుంటే చెప్పేది ఆఫీసరనే అనిపించలేదు'' అన్నది.

''నేను చూసినప్పుడు, ఆర్మీ దుస్తులు, నోట్లో పక్కకి సెంటెడ్ సిగరెట్, పాంట్ జేబులో లైటర్, వారటోపీ, రెండు జేబుల్లో చేతులు. స్త్రీలకి చనవీయటం లేదు. మంచి తెలుగు. మర్యాద. ఇటువంటివి చూస్తున్న నా కళ్లు నన్ను మోసగించినై. కాలం గడుస్తుండగా సహజ తత్త్వం బైటకొచ్చింది. అందుకే నీ కళ్లను నీవు నమ్మకు'' అన్నాను. పతి దేవునితో ''అంత చనవిస్తారేం? దూరంగా వుండమనలేరూ?'' అన్నా. ''పడనీ. రానీ. పరోపకారార్థమిదం శరీరం. బెట్టు చూపితే, బెడ్డింగ్ మీదున్నట్టు కలగంటారుట. చెప్పారు పాపం'' అని చిలిపిగా నవ్వారు. తనను చూసి భ్రమలు పెంచుకుంటారు స్త్రీలు అని వూహిస్తూవుంటారని అర్థమై వూరుకున్నా'' అన్నది తానూ భోజనం కానిస్తున్న చిత్ర.

''బాగుంది చిత్రా! నేను ఎక్స్‌ప్రెస్ అందుకుంటా థాంక్స్. దాపరికం లేకుండా మాట్లాడావు. అటువంటిదీ రోజుల్లో అరుదు డియర్'' అని లేచింది బిందు.

కథా నిలయం
5736
శ్రీకాకుళం